క్లుప్తంగా

చిరుధాన్యాలతో ఆరోగ్యం


చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి నీలిమ, శాస్త్రవేత్త తేజేశ్వరరావు, తదితరులు

పూసపాటిరేగ: చిరుధాన్యాలతో ఆరోగ్యం మెరుగు పడుతుందని శాస్త్రవేత్త తేజేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి కె. నీలిమ అన్నారు. మండలంలోని కొల్లాయివలసలో చిరుధాన్యాల విస్తరణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డెమోలో భాగంగా మండల పరిధిలో 50 ఎకరాలలో రాగులు సాగు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ చంద్రశేఖర్ బాబు, రీజనల్ టీమ్ లీడర్లు ప్రకాశ్, సుందర్, కొల్లాయివలస, పసపాం సర్పంచ్‌లు పైడి సుజాత, వాళ్లె చినతల్లి, తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్యంపై అవగాహన


ఫస్ట్ ఎయిడ్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

డెంకాడ: అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన వైద్యంపై చింతలవలస ఐదో ఏపీఎస్‌పీ బెటాలియన్ పోలీసులకు విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యులు ఎ.రామకృష్ణ, ఆదిత్మవర్మ అవగాహన కల్పించారు. సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ చేయాల్సి వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, ఎలా వ్యవహరించాలన్నదీ వివరించారు. బెటాలియన్ కమాండెంట్ రాహుదేవ్‌శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అదనపు కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు బీఆర్ శ్రీనివాసులు, డి.మురళీకుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది, యూనిట్ డాక్టర్లు, బెటాలియన్‌లోని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డేపల్లి రామకృష్ణారావు

భోగాపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డేపల్లి రామకృష్ణారావు అన్నారు. మండలంలోని అవంతి పాలిటెక్నిక్ కళాశాలలో రక్తదానంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దొరబాబు, అధ్యాపకులు ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాలు విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు మురళి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: వచ్చే నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరగనున్న ఏపీ ఎన్జీఓ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు మురళి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీహెచ్‌ఎన్‌సీ ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆగస్టు 21, 22 తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు సమావేశాలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో తనిఖీలు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోలో జోన్-1 డిప్యూటీ చీఫ్ మేనేజర్ బి.అప్పలనాయుడు శుక్రవారం తనిఖీలు చేశారు. కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో అమ్మకాలు, పార్శిల్ కౌంటర్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట డిపోమేనేజర్ కె.రమేష్, సూపర్‌వైజర్లు, గ్యారేజీ సిబ్బంది ఉన్నారు.

మంచి చేశాం.. ఆదరించండి..

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


నెల్లిమర్ల రూరల్: సతివాడలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: కుల, మత రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని సతివాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వ హయాంలో లేనివిధంగా వివిధ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లక్షల రూపాయిల లబ్ధి చేకూరిందని చెప్పారు. మంచి చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న మహా మోసగాళ్లను నమ్మొద్దని హితవు పలికారు. అనంతరం పలు సమస్యలు గుర్తించి వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్సీ పెనుమత్స

ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. పేదల అభ్యున్నతికే సీఎం జగనన్న నవరత్నాల పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. గతంలో టీడీపీ నాయకులు ప్రజలకు ఏమీ చేయకుండా, తాము మాత్రం బాగుపడ్డారన్నారు. తమ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక బురద చల్లుతున్న టీడీపీ నాయకులను ప్రజలు నమ్మరని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్డీ భానోజీరావు పాల్గొన్నారు.


విజయనగరం: 31వ డివిజన్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం..

విజయనగరం: ప్రజలందరి సంతోషమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు అన్నారు. నగరంలోని 31వ డివిజన్ నటరాజ్ కాలనీలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవినీతి, లంచగొండితనం లేని పారదర్శక పాలన రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరాభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు మారం బాలబ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, బైక్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్ నాగలక్ష్మి


బేతనాపల్లి వద్ద రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో మొక్కలు నాటుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, తదితరులు

డెంకాడ: ఐఏఎస్‌ల సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదతాడివాడ పంచాయతీ పరిధిలోని బేతనాపల్లి రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం మొక్కలు నాటారు. అటవీ శాఖ, జిల్లా జల యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అధికారులతో కలిసి వేప, ఎర్రచందనం, ఫికస్, టెర్మినాలియా, తదితర రకాలకు చెందిన మొక్కలు నాటారు.

అటవీ భూముల్లో ఇళ్ల పట్టాలు సాధ్యం కాదు..

తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బేతనాపల్లి గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్ నాగలక్ష్మిని కోరారు. దీనికి ఆమె స్పందిస్తూ అటవీ భూముల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వడం సాధ్యం కాదని, ప్రత్యామ్నాయ స్థలాలు చూసి కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి ఎస్.వెంకటేష్, డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎఫ్ఆర్‌ఓలు బి.అప్పలరాజు, ఆర్.రాజాబాబు, వీవీఎస్ఎన్ రాజు, పీవీ సింధు, ఉపాధి ఏపీఓ వెంకటరమణ, ఎఫ్ఎస్‌ఓలు, బీట్ అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

పేదవాడి ఆకలి తీర్చడం గొప్ప వరం

- డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్


పేదలకు ఆహారం వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ లయాయాదవ్, దాతలు

విజయనగరం: పేదవారి ఆకలి తీర్చడం దైవం ఇచ్చిన గొప్ప వరంగా భావించాలని డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఫుడ్‌కోర్టును శుక్రవారం ఆమె సందర్శించి, పేదలకు ఆహారం అందించారు. రత్నాల తనుశ్రీ తన తొలి జీతంలో కొంత మొత్తాన్ని అందించడంతో పేదలకు ఆహారాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ లయా యాదవ్ మాట్లాడుతూ, పేదలు ఆకలితో అలమటించకూడదన్న ఉద్దేశంతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరంలో ఆరు చోట్ల ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశారన్నారు. వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చే వారికి ఆహారాన్ని ఉచితంగా అందించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌జేబీ చౌదరి, నగేష్ కుమార్, గీత, ఇప్పిలి శ్రీను, సింహాద్రి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల, సూపరింటెండెంట్ అప్పలనాయుడు


సూపరింటెండెంట్‌కు వీల్‌చైర్లు అందజేస్తున్న సతీష్

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న పాండ్రంకి సతీష్ ఆస్పత్రికి ఆరు వీల్‌చైర్లను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సతీష్ ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగి అయినప్పటికీ రోగులకు తనవంతు సేవలు అందించాలనే ఉద్దేశంతో వీల్‌చైర్లు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ పి. లక్ష్మణరావు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్లు

- 39వ డివిజన్‌లో రూ.20.40 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్, డిప్యూటీ మేయర్లు

విజయనగరం: రాష్ట్రంలోని పెద్ద పెద్ద నగరాలకు దీటుగా విజయనగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 39వ డివిజన్ గౌతమినగర్, అలకానంద కాలనీ ప్రాంతాలలో రూ. 20.40 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న రహదారుల నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, నగరంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి బాటలో పయనిస్తోందని చెప్పారు. అయినప్పటికీ ప్రతిపక్ష టీడీపీ లేనిపోని విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతుభరోసా కేంద్రాలు, సబ్సిడీ రుణాలు, రైతుభరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తూ జగనన్న రైతు బాంధవుడిగా మారాడని చెప్పారు. కార్పొరేటర్ వింత ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గౌతమినగర్, అలకానందకాలనీ వంటి శివారు కాలనీలలో గత ముప్పై ఏళ్లలో జరగని అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయాయాదవ్, దాసరి సత్యవతి, పిన్నింటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న గోరుముద్ద

- ఆర్‌జేడీ జ్యోతికుమారి


వంటలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

భోగాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా చేపట్టాలని ఆర్‌జేడీ జ్యోతికుమారి స్పష్టం చేశారు. మండలంలోని ఆదర్శపాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని ప్రిన్సిపాల్ పార్వతి, నిర్వాహకులకు సూచించారు. అనంతరం పూర్తి స్థాయిలో జగనన్న విద్యాకానుక కిట్లు ఇచ్చారా, లేదా.. స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నదీ, లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన


కొల్లాయివలసలో పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ రామారావు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు, తదితరులు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని.. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చారని ఎంపీడీఓ జి. రామారావు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొల్లాయివలస సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించి 574 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, పాలనా విధానాలు చూసిన ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆకర్షితులవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరువయ్యాయన్నారు. పథకాలు అందని మిగిలిన ఒక్క శాతం అర్హులను వలంటీర్లు జల్లెడ పట్టి మరీ గుర్తించి పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రజలకు సులభంగా ధ్రువపత్రాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాగి విత్తనాలు కిట్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఏపీఓ రత్నమాల, వెలుగు ఏపీఎం పెంటంనాయుడు, కొల్లాయివలస, పసపాం సర్పంచ్‌లు పైడి సుజాత, వాళ్లె చినతల్లి, ప్రజాప్రతినిధులు తాడిశెట్టి బాబు, పైడి మధు, వాళ్లె సన్యాసినాయుడు, కంది రమణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి


రైతులకు విత్తనాల కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు,ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

వేపాడ: పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. మండలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 15 మంది ఎస్సీ రైతులను గుర్తించి వారికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.10 వేల విలువ చేసే వివిధ రకాల విత్తనాల కిట్లు, వ్యవసాయ పరికరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమావేశాలు నిర్వహించి, ప్రకృతి వ్యవసాయంతో కలిగే మేలు, సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధాకుమారి, ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఏ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులను 236 మందిని గుర్తించామని చెప్పారు. వారందరికీ ఉచితంగా చిరుధాన్యాల విత్తనాలు, వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ అప్పారావు, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రూ.7.75 లక్షలతో వసతిగృహ అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులోని ప్రభుత్వ గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహంలో ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహం ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుంచి రూ.7.75లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. నిరంతరం విద్యార్థినుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని, నాణ్యమైన భోజనం అందించాలని, హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, ఎస్.కోట సర్పంచ్ డి.సంతోషికుమారి, ఎంపీటీసీ ధారగిరి, మండల ఇంజనీర్ సత్యనారాయణ, వార్డెన్ కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో డెంగీ కలకలం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన 65 ఏళ్ల వ్యక్తి డి.సన్యాసిరావుకు డెంగీ జ్వరం సోకినట్టు కొట్టాం పీహెచ్‌సీ వైద్యురాలు జె.హారిక శుక్రవారం నిర్ధారించారు. బాధితుడు ప్రస్తుతం విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. బాధితుడు కడుపునొప్పి ఆయాసంతో ఎస్.కోట సీహెచ్‌సీలో ఆదివారం చేశారు. రెండురోజుల పాటు అక్కడే చికిత్స తీసుకున్నారు. ఆయాసం తగ్గకపోవడంతో వైద్యులు విజయనగరం కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. మంగళవారం శాంపిల్స్ సేకరించిన కేంద్రాస్పత్రి వైద్యులు అతను డెంగ్యూ బారిన పడ్డట్టుగా నిర్ధారించి, వైద్యం అందిస్తున్నారని, ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్ హారిక తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

బొండపల్లి: గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు మండల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మట్లాడుతూ గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో చేయాలని సూచించారు. జగనన్న లేఅవుట్లతో పాటు, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, ఏఓ డి.వెంకటరమణ పాల్గొన్నారు.

కనులపండువగా సహస్ర కలశాభిషేకం

విజయనగరం టౌన్: పట్టణంలోని మయూరీ జంక్షన్ వద్ద కొలువైన సంతోషిమాతకు శుక్రవారం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ప్రధానార్చకుడు రమేష్ తివారీ ఆధ్వర్యంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో యాగం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


యాగం నిర్వహిస్తున్న అర్చకులు


ఘటాలను తీసుకువెళ్తున్న భక్తులు